

అవకాశం ఇస్తే సేవ చేస్తాం

రాబోవు ఎన్నికల్లో మీ ఇంటి బిడ్డగా నన్ను ఆదరించండి..మీకు సేవ చేసే అవకాశం కల్పించండి అని ఎమ్మెల్సీ భరత్ కోరారు. - 8లో



ఎయిడ్స్ నిర్మూలనకు సమష్టి కృషి

ఎయిడ్స్ నిర్మూలనకు అధికారులు సమష్టిగా కృషి చేయాలని జడ్జి కరుణకుమార్, ఎమ్మెల్యే శ్రీనివాసులు, జేసీ శ్రీనివాసులు అన్నారు. - 8లో



క్రైమ్ పోలీస్‌స్టేషన్ తనిఖీ

చిత్తూరులోని క్రైమ్ (సీసీఎస్) పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ రిశాంత్‌రెడ్డి శుక్రవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. - 8లో

న్యూస్‌రీల్

ఉచితంగా గ్రూప్‌-2 కోచింగ్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని గిరిజన నిరుద్యోగులకు గ్రూప్‌-2 కోచింగ్ ఉచితంగా ఇవ్వనున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి మూర్తి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తిరుపతి జిల్లా కేంద్రంలోని గిరిజన కోచింగ్ సెంటర్‌లో గ్రూప్‌-2 కోచింగ్ ఇస్తామన్నారు. ఏదైన డిగ్రీ పూర్తి చేసి, ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు శిక్షణ పొందవచ్చని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు బయోడేటా తోపాటు విద్యార్హత, కుల ధ్రువీకరణపత్రం జిరాక్స్‌లతో ఈ నెల 5వ తేదీలోపు కలెక్టరేట్‌లోని జిల్లా గిరిజన సంక్షేమశాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఇతర వివరాలకు 8187899877 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

జిల్లా మైనారిటీ శాఖాధికారిగా చిన్నారెడ్డి



చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా మైనారిటీ శాఖాధికారిగా చిన్నారెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన జిల్లా మైనారిటీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఆయన్ని జిల్లా మైనారిటీ శాఖాధికారిగా నియమిస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వికసిత్ భారత్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : వికసిత్ భారత్ పోస్టర్ కలెక్టర్ షణ్మోహన్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆవిష్కరించారు. శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ షెడ్యూల్ ప్రకారం జిల్లా వ్యాప్తంగా వికసిత్ భారత్ సంకల్ప యాత్ర పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, తహసీల్దార్ శేషగిరి, డీపీఎం కోఆర్డినేటర్ షణ్ముగం పాల్గొన్నారు.

బెంగళూరు నుంచి తిరుమలకు పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న బెంగళూరు భక్తులు

తవణంపల్లె: తిరుమల శ్రీవారి దర్శనార్థం బెంగళూరు నుంచి భక్తుల బృందం పాదయాత్ర చేస్తూ శుక్రవారం తవణంపల్లె మండలానికి చేరింది. ఎగువ మత్యంలోని వీరాంజనేయస్వామి ఆలయం వద్ద భజనలు చేశారు. అర్చకులు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు. బెంగుళూరుకు చెందిన వెంకటేశ్వరస్వామి పాదయాత్ర ట్రస్టు ఆధ్వర్యంలో 450 మంది పాదయాత్ర చేస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 4వ తేదీ నాటికి తిరుమలకు చేరుకుంటామని ఆర్గనైజర్ నటరాజగౌడ్ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో రాహుకాల అభిషేక పూజలు



చౌడేపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో రాహుకాల అభిషేక పూజలు చేశారు. అమ్మవారికి వేద మంత్రోచ్చారణల నడుమ ఉదయం 10.30 నుంచి 12 గంటల మధ్యలో అర్చనలు, అభిషేక పూజలు చేశారు. పూజల అనంతరం అమ్మవారికి విశేషాలంకరణ చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. అభిషేక పూజలకు 95 మంది జంటల దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. వీరికి ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో అమ్మవారి పవిత్ర తీర్థప్రసాదాలు అందజేశారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో మార్పు

చిత్తూరు కలెక్టరేట్ : వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో స్వల్ప మార్పులు చేశామని జిల్లా ఐసీడీఎస్ శాఖ పీడీ నాగశైలజ తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ఈ పథకం కింద గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేసే టేక్ హోం రేషన్‌లో మార్పులు చేసినట్టు చెప్పారు. డిసెంబర్‌లో రెండో శుక్రవారం (ఈ నెల 8న), 4వ శుక్రవారం (22వ తేదీ) టేక్ హోం రేషన్ ఇవ్వనున్నట్టు తెలిపారు.

- శ్రీకాళహస్తికి చెందిన మునిరాజమ్మ అనే మహిళ రాజీవ్‌నగర్ కాలనీలో స్థలం ఆక్రమించుకుని ఇల్లు కట్టుకునేందుకు ప్రయత్నించింది. అయితే ఆ స్థలం ఆమెది కాకపోవటంతో రెవెన్యూ వారు అడ్డుకున్నారు. అయితే వీఆర్‌ఓ లంచం అడిగితే ఇవ్వకపోవడం వల్లే అడ్డుకున్నారని సదరు మునిరాజమ్మతో టీడీపీ నేతలు ప్రచారం చేయించారు. దీని వెనుక స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి హస్తం ఉందంటూ బుదరజల్లేందుకు యత్నించారు. దీనిపై రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగి విచారించగా.. ఆ స్థలం ఆమెది కాదని తేలడంతో టీడీపీ శ్రేణులు, మునిరాజమ్మ గప్‌చుప్ అయ్యారు. ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై నిందలు మోపి దుష్ప్రచారం చేసినందుకు గాను టీడీపీ నేతలు ఆమెకు రూ. 5లక్షలు బహుమతిగా ఇచ్చినట్లు తెలిసింది.
- పూతలపట్టు మండలం కొత్తూరు గ్రామానికి చెందిన నాగరాజునాయుడు టీడీపీ సానుభూతిపరుడు. అతడికి భార్య పావని, పిల్లలు మోహిత్, తేజ ఉన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక పలు పథకాల ద్వారా నాగరాజు కుటుంబం రూ.1,67,474 లబ్ధిపొందింది. ఇందులో వైఎస్సార్ ఆసరా కింద రూ.27,621, అమ్మ ఒడి రూ.55,000, సున్నావడ్డీ 6,933, వైఎస్సార్ ఆరోగ్య శ్రీ కింద రూ.64,420, రైతు భరోసా రూ.13,500ల చొప్పున్న ఫలాలు దక్కాయి. అయితే నాయకుడి మెప్పు కోసం ప్రభుత్వ పథకాలపై తప్పుడు ప్రచారం మొదలు పెట్టారు. తీరా అధికారులు లెక్కలతో సహా బయటపెట్టడంతో ఆ వ్యక్తి బిక్కమొహం వేశాడు.
- చిత్తూరు మండలంలో రెండు కుటుంబాల మధ్యన గత కొన్నేళ్లుగా భూ సమస్య ఉంది. ఇందులో టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మధ్యవర్తిగా తలదూర్చి గొడవ సృష్టించాడు. వారు కొట్టుకునేలా చేశాడు. తీరా పోలీస్ స్టేషన్‌లో ఇరువర్గాల వారి చేత ఫిర్యాదు చేయించాడు. మళ్లీ అతనే వెళ్లి పంచాయితీ పెట్టించాడు. తాను పోలీసుల ఇన్ఫార్మర్ అంటూ ఇరు వర్గాల వద్ద రూ. 10 వేలు వసూలు చేసి తానే పెద్ద మనిషిగా వ్యవహరించాడు. ఇద్దరిని ఒప్పించి సర్దుబాటు చేశాడు. కానీ డబ్బులు తీసుకున్న విషయం బయటపడడంతో గ్రామస్తులు నోళ్లు నొక్కుకుంటున్నారు.

పల్లెల్లో.. పచ్చ కుట్రలు!




- సామాన్య ప్రజలను రెచ్చగొట్టడమే పని
- సంక్షేమ పథకాలపై తప్పుడు ప్రచారం
- మట్టి, ఇసుక అక్రమ రవాణా అంటూ విషం కక్కుతున్న తమ్ముళ్లు
- అమాయకులను ఉసిగొల్పుతూ.. ప్రభుత్వంపై బురదజల్లే యత్నం

సాక్షి, తిరుపతి : ఎన్నికల సమయం దగ్గరపడుతుండటంతో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు తమకు అండగా ఉండే ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకుని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై అసత్య ప్రచారాలకు తెరలేశారు. అర్హత ఉన్నా ప్రభుత్వ పథకాలు అందడం లేదంటూ విషం కక్కుతున్నారు. సామాన్య జనాన్ని రెచ్చగొట్టి వీధుల్లోకి లాగుతున్నారు. స్థానికుల మధ్య వివాదాలు సృష్టించి.. వీటిని వైఎస్సార్‌సీపీ నాయకులకు అంటగట్టి రాక్షసానందం పొందుతున్నారు. చంద్రబాబు, లోకేష్‌ని స్ఫూర్తిగా తీసుకుని టీడీపీ నేతలు, కార్యకర్తలు రెచ్చిపోతున్నారు. పథకాలకు అనర్హులుగా ఉన్నవారికి లేనిపోనివి చెప్పి రెచ్చగొడుతున్నారు. వారి ద్వారా ప్రభుత్వంపై బురదజల్లుతున్నారు. ఎలాగైనా ప్రజలు పచ్చమాయలోకి దించాలని పన్నాగం పన్నుతున్నారు.

వైఎస్సార్‌సీపీ నేతలు పెద్ద ఎత్తున మట్టి, ఇసుకను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారంటూ ఎల్లోమీడియా సహకారంతో టీడీపీ నేతలు రోజూ ప్రచారం చేస్తున్న విషయం తెలిసిందే. అయితే ఇక్కడ జరిగేది వేరు. పూతలపట్టు– నాయుడుపేట జాతీయ రహదారి ఆరు లేన్ల విస్తరణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుమతితో మెగా కంపెనీ క్యూబిక్ మీటర్‌కు రూ.240 చెల్లించి మట్టి వాడుకుంటోంది. జగనన్న కాలనీల్లో లబ్ధిదారుల పక్కాగృహాల నిర్మాణానికి ఇసుక అవసరం అనేది అందరికీ విదితమే. పక్కాగృహాలు నిర్మించుకునే వారికి సర్కారే ఇసుకను ఉచితంగా సరఫరా చేస్తోంది. అయితే లబ్ధిదారులకు సరఫరా చేసే ఇసుకను కూడా అక్రమ రవాణా అంటూ ఎల్లో మీడియా సహకారంతో టీడీపీ దుష్ప్రచారం చేయిస్తోంది.

ఆదరణ చూసి ఓర్వలేక

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి నేటి వరకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 10.40 లక్షల కుటుంబాలు ఉండగా, అర్హతను బట్టి నవరత్న పథకాలు ప్రతి ఇంటి తలుపు తడుతున్నాయి. నిర్ణీత సమయానికి సంక్షేమ ఫలాలు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాకే జమవుతున్నాయి. పలువురు వాటిని సద్వినియోగం చేసుకుని ఆర్థిక ఎదుగుదలకు బాటలు వేసుకున్నారు. పథకాల అమలులో అవినీతికి తావులేకుండా పారదర్శకతకు పెద్దపీట వేశారు. ప్రభుత్వ సేవలు సైతం పల్లె ముంగిటకు వచ్చాయి. దీంతో గ్రామీణులు సైతం పట్టణాలు, మండల కేంద్రాలకు ప్రదక్షిణలు చేసే పనిలేకుండా ఉన్న ఊర్లోనే అని సేవలు పొందుతున్నారు. ఎవరెవరు ఏయే పథకాలకు అర్హులో వలంటీర్లే గుర్తించి దరఖాస్తు చేయించి పథకాలు ఇంటికే చేరుస్తున్నారు. ప్రభుత్వ పథకాలతో పాటు ఇంటి స్థలం, భూ పంపిణీ వంటి వాటిని అందజేస్తున్నారు. టీడీపీ సానుభూతిపరులు సైతం నవరత్న పథకాలు ఇంటికే చేరుతుండటంతో అవాక్కవుతున్నారు. టీడీపీ శ్రేణుల్లో ఎక్కువ మంది జగనన్నకు జైకొడుతున్నారు. గత ప్రభుత్వంలో జరిగిన అవినీతి, అక్రమాలు, పథకాల అమలులో జన్మభూమి కమిటీ పెత్తనం మళ్లీ మాకొద్దంటున్నారు. ఈ పరిణామాలను జీర్ణించుకోలేని పచ్చ బ్యాచ్ పల్లెల్లో చిచ్చుపెడుతోంది. గ్రామీణస్థాయిలో బలంగా ఉన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులపై తప్పుడు ప్రచారం చేయిస్తోంది. పోలీసు స్టేషన్, ప్రభుత్వ కార్యాలయాల్లో మేం చెప్పిందే వేదమంటూ ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తోంది. ప్రభుత్వ పథకాలు మీకు ఇవ్వరంటూ అనర్హులను రెచ్చిగొడుతూ సమస్యలు సృష్టిస్తోంది. రచ్చ చేసి ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేయడమే పనిగా పెట్టుకుంది.



పుంగనూరుకు మంచి రోజులు



ఆరడిగుంట వద్ద భూముల మ్యాప్‌ను పరిశీలిస్తున్న సీఈఓ ఆండ్రియాస్ హేగర్, కంపెనీ ప్రతినిధులు

- జర్మన్ కంపెనీ బృందం పరిశీలన
- ఎదురుచూసిన జనం
- మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌ల కృషి

పుంగనూరు: పుంగనూరుకు మంచిరోజులొచ్చాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అంతర్జాతీయ ఖ్యాతి దక్కించుకోబోతోంది. ఒకప్పుడు మహానగరాలకే పరిమితమైన పరిశ్రమలు ఇప్పుడు పుంగనూరులో పెట్టేందుకు ఇక్కడికి వచ్చి వాలిపోతున్నాయి. రాష్ట్ర మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి సొంత నియోజకవర్గం పారిశ్రామికాభివృద్ధి బాటపట్టింది. పుంగనూరు ఉపాధి కల్పన కేంద్రంగా మారడంతో మంచి రోజులు వచ్చాయంటూ జనం సంబరాలు చేసుకుంటున్నారు

పుంగనూరులో స్థల పరిశీలన

పెప్పర్ మోషన్ కంపెనీ సీఈఓ శుక్రవారం కలెక్టర్ షణ్మోహన్ ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్ బస్సుల తయారీ సంస్థ స్థాపనకు స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆండ్రియాస్ హేగర్, సీటీఓ డాక్టర్ మదియాస్ కెల్లర్, సీఎస్‌ఓ సత్య, ఫైనాన్స్ డైరెక్టర్ ఉవే స్టెల్లర్, నాఉర్థ్ ఎలక్ట్రిక్ ఎండీ హర్ష ఆధ్యా, పెప్పర్ సీఈఓ రాజశేఖర్‌రెడ్డి, సీఎస్‌ఓ సత్యబులుసు, సీసీఓ రవిశంకర్‌తో కలసి ఆరడిగుంట, వనమలదిన్నె, మేలుందొడ్డి గ్రామాల్లో కేటాయించనున్న 800 ఎకరాల భూమిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో మంచినీరు, విద్యుత్, పుష్కలంగా లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కర్ణాటక, తమిళనాడు సరిహద్దు ప్రాంతమైన పుంగనూరు వ్యాపార లావాదేవీలకు అనువైన ప్రాంతం అని అభివర్ణించారు. రాష్ట్ర మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి కోరిక మేరకు ఇక్కడ కంపెనీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. సుమారు 10 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుందన్నా రు. ఫిబ్రవరిలోపు పనులు ప్రారంభిస్తామని తెలిపా రు. కంపెనీ ప్రతినిధులు వస్తున్నారన్న సమాచారం తెలియడంతో ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి వారికి స్వాగతం పలికారు. ఆర్డీఓ మనోజ్‌రెడ్డి, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, పీకే ఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్‌తో కలసి సీఈ ఓ, కలెక్టర్, కంపెనీ ప్రతినిధులకు ఘన స్వాగతం పలికి, శ్యాలువలతో సత్కరించారు. సీమ జిల్లాల మైనార్టీ సెల్ ఇన్‌చార్జ్ ఫక్రుద్దీన్‌షరీఫ్, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, రాష్ట్ర జానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, పార్టీ మండల అధ్యక్షుడు కొత్తపల్లె చెంగారెడ్డి, సచివాలయాల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కార్యదర్శులు చంద్రారెడ్డి యాదవ్, దేశిదొడ్డి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, సీఐ రాఘవరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నిరుద్యోగులకు ఉపాధి

పడమటి నియోజకవర్గమైన పుంగనూరు మండలంలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన జర్మన్ పెప్పర్ ఎలక్ట్రికల్ బస్సుల కంపెనీ ఏర్పాటు చేయడం జిల్లా చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగ్గ రోజని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ కొనియాడారు. కంపెనీ ప్రతినిధులతో కలసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రమంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి చొరవతో పరిశ్రమ ఏర్పాటు అవుతోందన్నారు. నిరుద్యోగులు ఉపాధి కోసం వలసలు వెళ్లకుండా ఇక్కడే సుమారు 8 వేల మందికి ఉపాధి లభిస్తుందని కలెక్టర్ స్పష్టం చేశారు. స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు పూర్తి సహకారం అందించి, కంపెనీ త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు.



పెప్పర్ కంపెనీ సీఈఓను సన్మానిస్తున్న నేతలు

అభివృద్ధిని అడ్డుకోవడం బాబు నైజం



బోనమంద సభలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

- బోనమంద సభలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సోమల: అభివృద్ధిని అడ్డుకోవడం చంద్రబాబు నైజమని రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భగనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని బోనమందలో సర్పంచ్ విమల, ఎంపీటీసీ సభ్యురాలు సర్వేశ్వరమ్మ అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. పడమటి మండలాలైన సోమల, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల, పీలేరు ప్రజలకు తాగు, సాగు నీరు అందించడానికి ఆవులపల్లె వద్ద సీతమ్మ చెరువు రిజర్వాయర్ నిర్మిస్తుండడం జీర్ణించుకోలేని టీడీపీకి చెందిన నాయకులు గత ప్రభుత్వాల్లో కబ్జా చేసిన అటవీ భూముల్లో సాగు చేసిన మామిడి తోటలు పోతాయని చంద్రబాబు ప్రాద్బలంతో కేసులు వేసి, ఆపేశారని తెలిపారు. ఎవరెన్ని కుట్రలు చేసినా రైతులు, ప్రజలకు త్వరలోనే కోర్టు ద్వారా విజయం సాధించి పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు 100 పేజీల మేనిఫెస్టోలో 600 హామీలను ఇచ్చారని, వాటిలో ఒక్క హామీనైనా నేరవేర్చారా? అని ప్రశ్నించారు. బ్యాంకులో ఉన్న బంగారం తాను అధికారంలో వస్తే ఆడబిడ్డల ఇంటికి వస్తుందని హామీ ఇచ్చారని, అవి ఇంటికి వచ్చాయా? అని అడిగారు. ఆ రుణాలను జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన వెంటనే మూడు దఫాలుగా ఆసరా పథకం ద్వారా అందించారని, నాలుగో విడత జనవరిలో అందజేస్తే మీ అప్పు తీరుతుందన్నారు. మనమంతా కలిసి కట్టుగా పనిచేసి జగన్‌మోహన్ రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు పోకల అశోక్ కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు గంగాధరం, ఎంపీపీ ఈశ్వరయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు, పార్టీ మండల ఉపాధ్యక్షుడు నాగభూషణం రెడ్డి, జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.



సభకు హాజరైన ప్రజలు

పోటెత్తిన ఓటరు



చిత్తూరు గాంధీ విగ్రహం వద్ద భారీ మానవహారంతో ఓటర్లు

చిత్తూరు అర్బన్: జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ప్రత్యేక ఓటరు నమోదుపై అవగాహన కల్పించేందుకు చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ ఆధ్వర్యంలో నగరంలో భారీ ర్యాలీ చేశారు. జాతీయ జెండాలు చేతబూని విద్యార్థులు, యువత, మహిళా సంఘాలు, ఉద్యోగులు ర్యాలీలో పాల్గొని, ఓటు విలువను నినదించారు. ఓటుహక్కు నమోదు అవగాహన ర్యాలీ కార్యక్రమాన్ని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ ప్రోగ్రాం (స్వీప్) కార్యక్రమంలో భాగంగా జిల్లాలో మొదటిసారి చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేసి, మానవహారం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మున్సిపల్ కమిషనర్ అరుణ, చిత్తూరు ఆర్డీఓ చిన్నయ్య, సహాయ కమిషనర్ గోవర్ధన్, తహసీల్దార్ మురళీమోహన్, డీటీ కిరణ్ కుమార్, ఎంఈఓ గోమతి, ఎంహెచ్‌ఓ డా. లోకేష్, ఏసీపీ రామకష్ణుడు, మెప్మా సీఎంఎం గోపి తదితరులు పాల్గొన్నారు.

వివక్ష వొద్దు



పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న కలెక్టర్ షణ్మోహన్, జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : వివక్షవొద్దని హెచ్‌ఐవీ సోకిన వారు కూడా మనుషులేనని కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో హెచ్‌ఐవీ బాధితులకు పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ హెచ్‌ఐవీ సోకిన వ్యక్తులు భయపడకుండా ముందుకు సాగాలన్నారు. ధైర్యంగా ఉండాలని చెప్పారు. హెచ్‌ఐవీ సోకిన వ్యక్తుల వ్యక్తిగత వివరాలను నివేదిక రూపంలో అందజేయాలని తెలిపారు. ఏటీఆర్, పీహెచ్‌సీ కేంద్రాల్లో ప్రతి నెలా మందులను ప్రభుత్వం అందజేస్తోందని చెప్పారు. అనంతరం పౌష్టికాహారం, దుస్తులను వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో జేసీ శ్రీనివాసులు, డీఎంహెచ్‌ఓ ప్రభావతి, అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో నష్టాలు అధిగమించేలా చర్యలు



చిత్తూరు ఆర్టీసీ బస్టాండ్‌లో తనిఖీలు చేస్తున్న ఈడీ వెంకటేశ్వర్ రావు

చిత్తూరు రూరల్: ఆర్టీసీలో నష్టాలు అధిగమించేలా చర్యలు చేపట్టామని ఈడీ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. చిత్తూరులోని ఆర్టీసీ బస్టాండ్‌ను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. మరుగుదొడ్ల నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కంపు కొడుతోందని, వెంటనే శుభ్రం చేయించాలని ఆదేశించారు. అలాగే బస్టాండ్‌లోని రోడ్లు, కాలువలను పరిశీలించారు. వీటిని మరమ్మతు చేయడంతోపాటు లైట్లు సక్రమంగా వెలిగేలా చూడాలన్నారు. డిపో గ్యారేజీని పరిశీలించారు. అనంతరం గ్యారేజీలో ఆర్టీసీ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో రూ.4 కోట్ల మేర నష్టాల నుంచి గట్టెక్కామన్నారు. ఇందుకు కారణం ప్రయాణికులకు సౌకర్యార్థంగా బస్సులు నడపడమేనన్నారు. పండుగలు, వారం చివరి రోజుల్లో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా బస్సులు తిప్పుతున్నామన్నారు. వచ్చే ఏడాది జోన్‌-4కు 500 వరకు కొత్త బస్సులు రానున్నాయన్నారు. ఇందులో 30 బస్సులను జిల్లాకు కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కాణిపాకం మార్గంలో లక్కీ డ్రా ద్వారా ఎంపికైనా ప్రయాణికులకు బహుమతులు అందజేశారు. గ్యారేజీ పరిశుభ్రత పాటించిన సిబ్బందికి ప్రశాంసపత్రాలు అందజేసి, అభినందించారు. ఈ కార్య క్రమంలో డీపీటీఓ జితేంద్రనాథ్‌రెడ్డి, సీఐ అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైతులకు అండగా సింగిల్ విండో



గుడుపల్లెలో డీసీసీబీ ఏటీఎంను ప్రారంభిస్తున్న ప్రముఖులు

గుడుపల్లె: సహకార సంఘం బ్యాంకు(సింగిల్ విండో) రైతులకు అండగా ఉంటుందని డీసీసీబీ చైర్మన్ ఎం రెడ్డెమ్మ పేర్కొన్నారు. శుక్రవారం గుడుపల్లె, శాంతిపురం మండలాల్లో సింగిల్ విండో బ్యాంకు అనుసంధానంతో నూతనంగా ఏర్పాటు చేసిన ఏటీఎంలను ప్రారంభించారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్, డీసీసీబీ సీఈఓ మనోహర్‌గౌడ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. రెడ్డెమ్మ మాట్లాడుతూ బ్యాంకులో జీరో ఖాతాలు చేసుకున్న వారికి బీమా ఉపయోగం, సున్నావడ్డీతో పంట రుణాలు సౌకర్యం ఉంటుందన్నారు. బంగారు నగలపై తక్కువ వడ్డీకి రుణాలు ఇస్తామని చెప్పారు. డిపాజిట్ చేసిన వారికి ఆకర్షణీయమైన వడ్డీ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రెస్కో చైర్మన్ సెంథిల్, జెడ్పీటీసీ సభ్యుడు కృష్ణమూర్తి, పార్టీ మండల రామకృష్ణ, సింగిల్ విండో చైర్మన్ కృష్ణమూర్తి, డీసీసీబీ చీఫ్ మేనేజర్ గణేష్‌కుమార్, సింగిల్ విండో సీఈఓ దిలీప్, రామమూర్తి, డైరెక్టర్లు గంగప్ప, బాబులు పాల్గొన్నారు.

విశ్వంలో ఉచిత నమూనా పరీక్ష రేపు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం స్కూల్లో ఆదివారం ఉదయం 9గంటలకు సైనిక్, నవోదయ, మిలటరీ పాఠశాల ఎంట్రన్స్ టెస్ట్‌కు సంబంధించి నమూనా పరీక్ష, అవగాహన సదస్సును ఉచితంగా నిర్వహించనున్నారు. శుక్రవారం ఈ మేరకు విశ్వం విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. నమూనా పరీక్ష, అవగాహన సదస్సులో ప్రస్తుతం 4నుంచి 9వ తరగతి చదివే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొనవచ్చని తెలిపారు. వీరికి ఆయా పోటీ పరీక్షలకు సంబంధించిన సందేహాలను నివృత్తి చేయడంతో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 93999 76999, 86888 88802 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నిరుపేదలకు సురక్ష

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన జగనన్న సురక్ష నిరుపేదలకు రక్షణ కవచంలా నిలిచింది. కుల, మత, పార్టీలకతీతంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో అర్హులందరికీ అవసరమైన ధ్రువపత్రాలను అందజేసింది. టీడీపీ పాలనలో చంద్రబాబు జన్మభూమి కమిటీలతో ప్రజా సంక్షేమాన్ని పక్కన పెట్టి ధన దోపిడీకి ప్రాధాన్యత నిచ్చారని ప్రజలు విమర్శిస్తున్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి అమ లు చేసిన జగనన్న సురక్ష పథకంలో 11 రకాల సర్టిఫికెట్లు ఉచితంగా అందాయని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. లబ్ధిదారుల ఆనందం వారి మాటాల్లోనే..

–చిత్తూరు కలెక్టరేట్

జనవాక్కు



జగనన్న సురక్ష శిబిరంలో సర్టిఫికెట్లు అందుకున్న లబ్ధిదారులు

ఆదాయ ధ్రువీకరణ పత్రం అందింది



నాకు ఆదాయ ధ్రువీకరణ పత్రం ఉచితంగా ఇచ్చారు. అవసరమైన సమయంలో జగనన్న సురక్ష సర్వే అంటూ వలంటీర్ మా ఇంటి వద్దకు వచ్చారు. నాకు అవసరమైన ధ్రువపత్రాల గురించి తెలియజేశాను. అడిగిన డాక్యుమెంట్స్ అందజేశాను. వలంటీర్ అవసరమైన అన్ని వివరాలు తెలుసుకుని వెళ్లారు. ఎలాంటి ఖర్చు లేకుండా జగనన్న సురక్ష క్యాంపులో నాకు ఆదాయ ధ్రువీకరణ పత్రం అందజేశారు. ఇలాంటి మంచి పథకం అమలు చేసిన సీఎంకు ధన్యవాదాలు.

- రామక్క, ఎం.కొత్తూరు గ్రామం, నగరి మండలం

సులువుగా సమస్యల పరిష్కారం



వలంటీర్ ఇంటి వద్దకు వచ్చి వివరాలు సేకరించారు. ధ్రువపత్రం పొందాలంటే ఎక్కడికి వెళ్లాలో.. ఎలా తీసుకోవాలో కూడా నాకు తెలియదు. ప్రభుత్వం జగనన్న సురక్ష క్యాంప్ నిర్వహిస్తోందని వలంటీర్ వచ్చి చెప్పారు. ఈ క్యాంప్‌తో ఆధార్‌కార్డుకు ఫోన్ నంబర్ లింక్ చేసుకున్నాను. నేను ఏ ఆఫీసుకు వెళ్లకుండానే ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు తీసుకున్నాను. ఇంత సులభంగా ఇన్ని పనులు చేస్తున్న సీఎంకు రుణపడి ఉంటాను.

- రాణియమ్మ, అగరంపేట, నింద్ర మండలం,

ఇంటి వద్దకే పథకాలు



సంక్షేమ పథకాలు ఇంటి వద్దనే అందుకుంటున్నాం. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంతో నా కుటుంబానికి ఎంతో మేలు చేకూరింది. నేను కుల ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు పెట్టుకున్నాను. పైసా ఖర్చు లేకుండా మా ఊరి సచివాలయంలో అధికారులు ధ్రువపత్రం తెచ్చి ఇచ్చారు. గత పాలనలో కాళ్లు అరిగేలా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా ధ్రువపత్రాలు ఇచ్చేవారు కాదు. గతంలో ఏ ప్రభుత్వం చేయని మేలును ఈ ప్రభుత్వం చేసింది. మాలాంటి పేదలకు సంక్షేమ పథకాలు అందజేస్తున్న సీఎం మేలును మా ఇంటిల్లి పాది గుర్తు పెట్టుకుంటాం.

- చంద్రమ్మ, చిన్నవెంకటపల్లె, ఐరాల మండలం

సర్టిఫికెట్ల బాధ తీర్చారు



అవసరానికి ఏ సర్టిఫికెట్ కావాలన్నా దాని కోసం పడే బాధ చెప్పుకోలేనిదయ్యా. ప్రస్తుతం ఈ ప్రభుత్వంలో మాకు ఎన్నో ఏళ్లుగా రాని సర్టిఫికెట్లను సులువుగా ఇంటి వద్దనే తీసుకున్నాను. నేను ఇప్పటి వరకు ఇలాంటి కార్యక్రమాన్ని ఎప్పుడూ చూడలేదు. మా పిల్లలకు గతంలో ఆదాయ, కుల ధ్రువపత్రాలు అవసరమైతే తహసీల్దార్, మీసేవ కార్యాలయాల చుట్టూ ఎన్నో సార్లు తిరిగాను. ఏదో ఒక కారణం చెప్పి మీకు ధ్రువపత్రాలు మంజూరు కావు అని చెప్పేశారు. ఇప్పుడు మాకు అవసరమైన 11 ధ్రువపత్రాలు ఇచ్చారు. మంచి పనులు చేస్తున్న సీఎం మేలు మరిచిపోలేనిది.

- గౌరమ్మ, లబ్ధిదారు, కుప్పం

చురుగ్గా పింఛన్ల పంపిణీ

చిత్తూరు అగ్రికల్చర్: జిల్లాలో సామాజికి పింఛన్ల పంపిణీని శుక్రవారం వలంటీర్లు చురుగ్గా చేపట్టారు. వేకువజాము 5 గంటల నుంచే పింఛన్ల నగదును లబ్ధిదారులకు ఇంటి వద్దనే అందజేశారు. అలాగే అనారోగ్యంతో ఇతర ప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి కూడా నేరుగా పింఛన్ మొత్తాలను అందజేశారు. దీంతో సాయంత్రం 6 గంటలకు మొత్తం పింఛనుదారుల్లో 85.06 శాతం పంపిణీని పూర్తి చేశారు. రెండు రోజుల్లో వందశాతం పంపిణీని పూర్తి చేస్తామన్లి డీఆర్‌డీఏ పీడీ తులసి తెలిపారు.

నిర్ణీత గడువులోపు పూర్తి చేయండి



మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు

గంగవరం: ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలను నిర్ణీత గడువులోపు నిర్మాణాలు పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఆయన పలమనేరు ఆర్డీఓ కార్యాలయంలో పంచాయతీరాజ్ ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి కాంట్రాక్టర్లతో పనుల పురోగతిపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ సేవలను ప్రజల ఇంటి ముంగిటకే తెచ్చేందుకు చేపట్టిన ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతుభరోసా కేంద్రాలు, సచివాలయాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలన్నారు. ఈ భవనాల నిర్మాణం పూర్తి చేస్తేనే సేవలు ప్రారంభించేందుకు అవకాశం ఉంటుందన్నారు.

కానిస్టేబుల్‌కు ప్రశంసాపత్రం అందజేత



ప్రశంసాపత్రం అందుకుంటున్న రఘురామ్

చిత్తూరు అర్బన్: పెనుమూరు పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న రఘురామ్‌కు ఎస్పీ రిశాంత్‌రెడ్డి శుక్రవారం ప్రశంసాపత్రం అందజేశారు. పలు కేసుల ఛేదనలో తమిళనాడు పోలీసులకు ఇతను సహకారం అందిస్తున్నారు. రెడ్ హ్యాండ్‌గా నిందితులను పట్టించడంలో కీలక ప్రాత పోషించారు. ఈయన పనితీరు గుర్తిస్తూ కోయంబత్తూరు రేంజ్‌శాఖ పోలీసులు రఘురామ్‌కు ప్రశంసాపత్రం ఇచ్చారు. ఎస్పీ రిశాంత్‌రెడ్డి ఈ పత్రాన్ని రఘురామ్‌కు అందించి, అభినందించారు.

క్రైమ్ పోలీస్‌స్టేషన్ తనిఖీ

చిత్తూరు అర్బన్ : నగరంలోని క్రైమ్ (సీసీఎస్) పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ రిశాంత్‌రెడ్డి శుక్రవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా క్రైమ్ స్టేషన్‌ను తనిఖీ చేసి అక్కడ ఉన్న పలు రికార్డులను పరిశీలించారు. హత్యకేసులు, దోపిడీ తేదితర ఘటనల్లో సీసీఎస్ పోలీసుల పనితీరును క్షుణ్ణంగా తనిఖీ చేశారు. నేరాల ఛేదనలో తన దైనశైలి కనబరచిన రఘురామ్‌ను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌బీ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, క్రైమ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్, ఎస్ఐ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

అప్పు తీర్చలేదని కత్తితో దాడి



కత్తిదాడిలో గాయపడిన వ్యక్తిని 108 వాహనంలో చిత్తూరు ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

తవణంపల్లె: అప్పుగా ఇచ్చిన డబ్బును తిరిగి ఇవ్వలేదని ఆగ్రహించిన ఓ వ్యక్తి కత్తితో దాడి చేసిన సంఘటన శుక్రవారం సాయంత్రం మండలంలోని టి.పుత్తూరు రోడ్డు లో చోటుచేసుకుంది. గ్రామ స్తులు, బాధితుడి కథనం మేర కు.. చిత్తూరులోని లాయర్స్ కాలనీకి చెందిన మునస్వామి వద్ద జోగివారిపల్లెకు చెందిన ఉదయ్‌కుమార్ తల్లిదండ్రులు కొంత అప్పు చేశారు. ఈ విషయమై పెద్దమనుషుల వద్ద పంచాయితీ పెట్టినా డబ్బులు తిరిగి ఇవ్వలేదనే ఆగ్రహంతో మునస్వామి ద్విచక్ర వాహనంలో వచ్చి, జోగివారిపల్లె నుంచి తవణంపల్లెకు నడచి వెళుతున్న ఉదయ్‌కుమార్‌పై కత్తితో దాడి చేశాడు. అక్కడ పశువుల కాపరులు గమనించి కేకలు వేయడంతో మునస్వామి పారిపోయాడు. ఈ దాడిలో బాధితుడి చేతివేళ్లు, కాలుకు తీవ్రగాయాలవడంతో తవణంపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథ మ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108లో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు.

చేపల వలలో కొండచిలువ



కొండచిలువను పట్టుకున్న స్నేక్ క్యాచర్

నగరి : పట్టణంలోని రాజీవ్‌నగర్ సాయిబాబా ఆలయం సమీపం ఉన్న చెరువులో జాలర్లు చేపల కోసం వల వేయగా అందులో చేపలతో పాటు కొండచిలువ చిక్కడంతో భయాందోళనకు గురయ్యారు. వలను అక్కడే గట్టుపై పడేసి కార్వేటినగరం ఎఫ్ఆర్వో వెంకటసుబ్బయ్యకు సమాచారం అందజేశారు. అటవీ శాఖ అధికారులు స్నేక్ క్యాచర్ శ్రీకాంత్‌కు సమాచారం అందించగా అతను సంఘటనా స్థలానికి విచ్చేసి వల నుంచి కొండచిలువను బయటకు తీసి, అటవీ ప్రాంతంలో తీసుకెళ్లి వదలిపెట్టారు.

ఎయిడ్స్ నిర్మూలనకు సమష్టి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్

- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జేసీ శ్రీనివాసులు
- చిత్తూరులో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

చిత్తూరు రూరల్: ఎయిడ్స్ నిర్మూలనకు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సమష్టిగా కృషి చేయాలని, ప్రభుత్వ వైద్య సేవలను బాధితులకు అందేలా చూడాలని సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జేసీ శ్రీనివాసులు అన్నారు. చిత్తూరులో శుక్రవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. చిత్తూరు జిల్లా ప్రభుత్వాస్పత్రి నుంచి గాంధీ విగ్రహం వరకు అధికారులు, విద్యార్థులతో కలిసి ర్యాలీ చేశారు. అక్కడ మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం జెడ్పీ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడారు. కొందరు సురక్షితం కానీ శృంగారంలో పాల్గొనడంతో ప్రాణాంతక హెచ్ఐవీ వ్యాధిని కొని తెచ్చుకుంటున్నారని చెప్పారు. ప్రభుత్వంతోపాటు పలు స్వచ్ఛంద సంస్థలు ఈ మహమ్మారిపై అవగాహన కల్పిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకురావడంతో బాధితుల సంఖ్య గత మూడేళ్లుగా తగ్గుముఖం పడుతుందన్నారు. బాధితులకు ప్రభుత్వం అందజేస్తున్న సేవలు, ఫలాలు అందేలా చూడాలని సూచించారు. బాధితులు, వారి కుటుంబ సభ్యులపై చిన్నచూపు చూడడం తగదన్నారు. అనంతరం వైద్యాధికారులు, సిబ్బంది ఉత్తమ సేవలను గుర్తించి, ప్రశాంస పత్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో మేయర్ అముద, డీఎంహెచ్ఓ ప్రభావతీదేవి, డీఐఓ రవిరాజు, జిల్లా క్షయ నివారణ అధికారి వెంకటప్రసాద్, ఎస్ఓ జార్జ్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ మధుమేహం లాంటిది.. ఆందోళన వద్దు

హెచ్ఐవీ మధుమేహవ్యాధి లాంటిదని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఏపీఎస్ ఆర్టీసీ వైస్‌చైర్మన్ ఎంసీ విజయానందరెడ్డి అన్నారు. చక్కర వ్యాధి ఉంటే ఎలా అదుపులోకి ఉంచుకోవడానికి ఏం చేస్తామో, ఎయిడ్స్ ఉన్నా అలాగే జాగ్రత్తగా మందులు తీసుకుంటే దీనిపై ఆందోళన చెందాల్సిన పని ఉండదన్నారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని, చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలోని ఏఆర్‌టీ కేంద్రంలో హెచ్ఐవీతో బాధపడుతున్న దాదాపు 70 మంది బాధితులకు శుక్రవారం విజయానందరెడ్డి నూతన వస్త్రాలు, పోషక పదార్థాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆధునిక వైద్యరంగంలో హెచ్ఐవీ పాజిటివ్ ఉన్న వారికి ఆ వ్యాధిని నయంచేసి నెగటివ్‌గా తీసుకొచ్చేందుకు ఇప్పటికే పలు మందులను కనిపెట్టారన్నారు. త్వరలోనే దేశంలోకి కూడా అవి అందుబాటులోకి వస్తాయన్నారు. క్రమం తప్పకుండా వైద్యులు ఇచ్చే మందులను వాడుతూ, పోషకాహారాలు తీసుకుని వ్యాయామం చేయడంతో హెచ్ఐవీ నుంచి బయటపడొచ్చన్నారు. బాధితులకు ఎలాంటి సాయం కావాలన్నా అందించడానికి తాను ముందుంటానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, వైద్యాధికారులు సుధాకర్, వీర అమర్‌నాథ్, విజయకుమార్, కార్పొరేషన్ కోఆప్షన్ సభ్యులు అను, వైఎస్సార్ సీపీ నాయకులు వెంకటేష్, విజయ్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.



పోషకాహార కిట్లను అందజేస్తున్న విజయానందరెడ్డి

అవకాశం ఇస్తే ప్రజలకు సేవ చేస్తాం

- మీ ఇంటి బిడ్డగా ఆదరించండి
- ఇంకెంతకాలం బాబు మాటలు విని మోసపోతారు?
- ఎమ్మెల్సీ భరత్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భరత్

కుప్పం: 'మా తాతగారు జీవించి ఉన్నరోజుల్లో కుప్పం ప్రజలకు సేవా చేయాలని మా నాన్న చంద్రమౌళి ఇక్కడికొచ్చారు.. తరువాత ఆయన ఆశయం కోసం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేస్తున్నా.. రాబోవు ఎన్నికల్లో మీ ఇంటి బిడ్డగా నన్ను ఆదరించండి..మీకు సేవ చేసే అవకాశం కల్పించండి' అని ఎమ్మెల్సీ భరత్ ప్రజలను కోరారు. శుక్రవారం కుప్పం మున్సిపాలిటీ 9వ వార్డు మోడల్ కాలనీలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సచివాలయ పరిధిలో సంక్షేమ లబ్ధి వివరాల ప్రగతి బోర్డులను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. మోడల్ కాలనీలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రజలు జగనన్న పాలనలో ఎంత మేలు పొందారో గుర్తెరగాలని కోరారు. 35 ఏళ్లుగా కుప్పంకు ప్రాతినిధ్యం వహిస్తున్న చంద్రబాబు పాలనలో కుప్పం నియోజకవర్గం ఎలా ఉండేది? జగనన్న సీఎం అయ్యాక ఇక్కడ అభివృద్ధి ఏ రీతిలో పరుగులు తీసిందో బేరీజు వేసుకుని చూసి తమ పార్టీకి మరోసారి పట్టం కట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్, ఏఎంసీ చైర్మన్ విద్యాసాగర్, స్థానిక కౌన్సిలర్, వైస్ చైర్మన్ హఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

సరసమైన ధరలకు నాణ్యమైన వస్తువులు



సిబ్బందికి బహుమతులు అందజేస్తున్న డీఆర్‌డీఏ పీడీ తులసి

పెనుమూరు(కార్వేటినగరం): మహిళా మార్టులో సరసమైన ధరలకు నాణ్యమైన సరుకులు లభిస్తాయని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ తులసి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో లాభాల బాటలో నడుస్తున్న మహిళా మార్టుకు మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ పీడీ మాట్లాడుతూ పెనుమూరులో నిర్వహిస్తున్న మహిళా మార్టులో ఇప్పటికే రూ.2 కోట్లకు పైగా లావాదేవీలు జరిగాయని, జిల్లాలోనే రెండో స్థానం నిలిచిందన్నారు. ఈ మార్టును డ్వాక్రా మహిళలు కలసి ఏర్పాటు చేసుకున్నారని, ప్రజలు మహిళా మార్టులోనే వస్తువులు కొనుగోలు చేయాలని కోరారు. వినియోగదారులకు కావాల్సిన వస్తువులు మార్టులో లేకపోయినా వెంటనే తెప్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. మహిళా మార్టు ద్వారా వచ్చే లాభాలను డ్వాక్రా గ్రూపులకు అందిస్తామని పీడీ పేర్కొన్నారు. ప్రతి గ్రూపు ఇలాగే మార్టులు ఏర్పాటు చేసుకుని, ఆర్థికంగా ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అనంతరం మహిళా మార్టులో విధులు నిర్వహిస్తున్న మహిళలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నీలకంఠేశ్వర్‌రెడ్డి, ఈఓపీఆర్డీ మహేశ్వర్‌రెడ్డి, ఏపీఎం హరికృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యాధికారికి జాతీయ స్థాయి అవార్డు



జాతీయ స్థాయి అవార్డు అందుకుంటున్న డాక్టర్ చందనప్రియ

సోమల: మండలంలోని పెద్ద ఉప్పరపల్లె పశువైద్యాధికారి డాక్టర్ చందన ప్రియకు జాతీయ స్థాయి పురస్కారం లభించింది. విజయవాడ గన్నవరం ఎన్‌టీఆర్ కళాశాలలో రెండు రోజులుగా జరిగిన ఈ టెక్నికల్ కాన్ఫరెన్స్‌లో దేశ వ్యాప్తంగా 231 మంది పశుసంవర్ధకశాఖకు చెందిన వైద్యులు పాల్గొన్నారు. గొర్రెల శస్త్ర చికిత్సలపై ప్రయోగాత్మక సారాంశాన్ని చందనప్రియ వివరించి, ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు రాష్ట్ర పశువర్ధక శాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ సత్యకుమారి చేతుల మీదుగా చందనప్రియ జాతీయ స్థాయి అవార్డు అందుకున్నారు. అవార్డు రావడం పట్ల ఆమె తన బాధ్యత మరింత పెరిగిందని, పాడి రైతులకు మరిన్ని సేవలు అందించడానికి కృషి చేస్తానని తెలిపారు.

పకడ్బందీగా ప్రత్యేక ఓటరు శిబిరాలు



మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్



పాల్గొన్న ఈఆర్వో, ఏఈఆర్వోలు

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా వ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈ నెల 2, 3 తేదీల్లో నిర్వహించే ప్రత్యేక ఓటర్ల శిబిరాలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఈఆర్వో, ఏఈఆర్వోలతో ఆయన సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు నమోదు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలన్నారు. పొరబాట్లు చోటు చేసుకుంటే కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎలక్టోర్ పాపులేషన్ రేషియో, జండర్ రేషియో కచ్చితంగా ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ నెల 2, 3 తేదీల్లో బీఎల్‌వోలు ప్రతి పోలింగ్ కేంద్రంలో అందుబాటులో ఉండాలన్నారు. సమావేశంలో జేసీ శ్రీనివాసులు, డీఆర్వో రాజశేఖర్, ఈఆర్ఓలు శ్రీనివాసులు, మనోజ్‌కుమార్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శివయ్య తదితరులు పాల్గొన్నారు.